# తెలుగు మాష్టారి ప్రైవేట్

— పులిచెర్ల సుబ్బారావు

చాలారోజుల తర్వాత ఆదివారం మధ్యాహ్నం ములక్కాయ పప్పుచారుతో భుజించిన సంబరంతో కుక్కిమంచంపై మగతగా శయనించాడు తెలుగు మాష్టారు శంకరం. వెంటనే మే నెల గోల్డ్‌స్పాట్ లాంటి తియ్యటి కల వొచ్చింది. ఎంత తియ్యటి కలో!...

...ఇంట్లో ఎక్కడ చూసినా ప్రైవేటు పిల్లలే!...కిక్కిరిసి తన్నుకు చస్తున్నారు. తెలుగు, సైన్సు, సోషల్ లెక్కలు, ఇంగ్లీషు అబ్బో! ఇంగ్లీషు కూడా ఏకధాటిగా చెప్పేస్తున్నాడు తను. ఎప్పుడూ లేంది ఏమిటలా చెవులు రిక్కించి వింటున్నారు పిల్లలు!? వాకిట్లో పేరెంట్సు క్యూలో నిల్చుని వున్నారు. చావొచ్చిపడింది. ఎంతమందిని చేర్చుకోగల్డు! చెబితే వినరుగదా! "మావాడు ఇంగ్లీషులో పూరండీ!-మీరే నాలుగు ముక్కలు చెప్పాలి"- మరి నాలుగు పిక్కలెక్కుతారా?....బిల్డింగ్ ప్లాన్ వొచ్చింది. పునాది లేపాలి. ఇటికా సిమెంట్‌లాగే వొచ్చిపడుతున్నారు స్టూడెంట్స్! అడుగో! ఆ ఇంగ్లీషు మాష్టారు వెంకట్రావుకి కన్నెర్ర! ఏదైనా మందేసుకో కూడదూ! స్టాఫ్‌రూమ్‌లో గుసగుసలు! వీళ్ళ పీకలు కొయ్య!.. ఎవరూ ఆ వచ్చేది? కలెక్టరుగారే! వాళ్ళబ్బాయికి ప్రైవేట్ చెప్పాలి గాబోలు!....ఎక్కడ కూచుంటారు? ఆర్డరిచ్చిన సోఫా ఇంకా రాలేదు. ఎలా! తత్తర! ఒహటే తత్తర!...

తత్తరపాటులో కళ్లు తెరిచాడు శంకరం. ఎదురుగ్గా కుంటిముక్కాలిపీట తెగ వెక్కిరించేస్తోంది. పళ్లకొరికి. వొళ్లువిరిచి, తుళ్ళిలేచాడు వీరావేశంతో. ముక్కాలిపీటస్థానంలో సోఫా చూసేగాని నిద్రపట్టదు మళ్ళీ. చకచకా ఓ కాంపోజిషన్ నోట్‌బుక్‌లోంచి రెండు కాయితాలు బర్రున చించాడు. ఒకదానిమీద కట్టబోయే బిల్డింగ్ ప్లాన్ గీశాడు. ఏవిటిది? ఆ భవన సౌందర్యానికి హాశ్చర్యపడిపోయాడు. తనకు ఇంజనీర్ పట్టం లేకపోవడ-వల్ల దేశానికొచ్చిన ఉపద్రవాన్ని తలపోసి చింతించి, కల్లడిల్లి ఎట్టకేలకు ఊరడిల్లాడు. ఇహ రెండో కాయితమ్మీద నిక్కము ప్లస్ కల నిక్కాల అని రాసి ప్రైవేట్ ప్రణాళిక రచించసాగాడు. రచన పూర్తికాగానే దేశమ్మీద జాలి పుట్టుకొచ్చింది. ప్లాన్లంటూ ప్రభుత్వం అప్పులెత్తి మరీ తగలేస్తోంది! అంతా ప్రణాళికా రచన మీద ఆధారపడి వుంటుంది మరి! చేసుకున్న వారికి చేసుకున్నంత మహాప్రభో!

రెండు కాయితాలూ సీలువేసి, నిరుడు ఖాళీ అయిన జాడీలో ఊరవేశాడు. భార్యామణి పార్వతమ్మను పిలిచి కాస్సేపు చెవికొరికి వొదిలేశాడు. పార్వతమ్మకూడా తక్కువది కాదు. వైశాల్యంలో నిజంగా పర్వతరాజు పుత్రిక. అందుకే ఆవిణ్ణి 'పర్వతం' అని సంబోధిస్తాడు శంకరం వలపు పొంగారి చల్లారబోయే సమయాల్లో.

నిజమైన భారతనారి పార్వతమ్మ భర్త కలలను నిజం చేయబూనింది.

ఇంటి ఓనరుడి భార్యదాకా ఈడ్చింది శరీరాన్ని.

తినబోతున్న అరిసెని కొంగుచాటుచేసి "రావమ్మా బా రమ్మా!" అంది వాసరమ్మ.

"బాబేడి పిన్నీ?" అంటూ భద్రంగా కూర్చుంది పార్వతమ్మ. అరిసెను ఎక్కడ

చూసిందోనని అల్లాడిపోతూంది వానరమ్మ మనసు. అందుకే 'పిన్నీ' అన్నా నొచ్చుకో లేదు.

"ప్రైవేట్ కెళ్ళాడమ్మా!" అంది కొంగు సర్దుతూ. అరిసెతో చావొచ్చిపడింది!

"అదేవిటి పిన్నీ! వారుండగా ఎవరికో డబ్బు తగలెయ్యడమెందుకు?"

"మీ ఆయన చెబుతాడా?" చెప్పగలడా అనేది ధ్వని!

"అయ్యో, చెప్పకేమమ్మా! మీక దేనా? సాయంత్రంనుంచి పంపు పిన్నీ! వస్తా" అని లేచింది పార్వతమ్మ.

"మంచిది" అంది వానరమ్మ లేవకుండానే. లేస్తే అరిసె గతి?

పార్వతమ్మ కార్యశూరత్వానికి వాటాలన్నీ ఆరోజు అల్లాడిపోయాయి.

సాయంత్రానికి శంకరం వాటా పిల్లా మేకల్తో నిండి కళకళలాడుతూంది.

చంటాళ్ళ దగ్గర్నుంచి ఏడేళ్ళదాకా వుంది రేంజి. తక్కిన వాటాల్లో చడీచప్పుడు లేకుండా వాళ్ళకి ప్రాణం హాయిగా వుంది. ఆ పిల్లల్ని చూసి తెగ మురిసిపోతోంది పార్వతమ్మ. (తనకి పిల్లల్లేకకాదు. ఏడుగురు పిల్లలరవాత శంకరం నియంత్రణ అంటే ఏ యంత్రమూ వొద్దంటుంది ఆమె).

వానతోబాటు ఇంట్లో కురవబోయే కన కాన్ని గురించి తలపోసి కులకలేక చస్తోంది. మార్వాడీ కొట్టులోని నగల్లో ఒహటి నచ్చేట్టు లేదామెకి. తనకి సరిపడే జరీచీరని దగ్గరుండి నేయించాలని వాంఛిస్తోంది.

పప్పుచార్లో ములక్కాయలకోసం శంకరం పుత్రులు కుస్తీ పడుతూంటే వింతగా చూస్తూ కూచున్నారు పిల్లలంతా.

పెళ్ళైన ఇన్నేళ్ళకి భార్య నిజంగా అర్థాంగి అనుకున్నాడు శంకరం. పైకి అనలేదు. అంత మనిషిని పట్టుకుని అర్థాంగి అంటే వొప్పుకుంటుందా? తన పిల్లలందర్నీ వంట గదిలో పెట్టి తాళంవేసి, ప్రైవేటు పిల్లలకి పిప్పరమెంట్లు పంచాడు. అందరూ బిగ్గరగా చప్పరిస్తూ శంకరంవైపే చూడసాగారు. వానరుగారి రెండేళ్ళ కూతురైతే మరీను! 'అబ్బ చదువంటే ఎంత శ్రద్ధో' అనుకున్నాడు శంకరం

తన చదువు వింటానికి చుట్టుపట్ల వాటాల వాళ్ళంతా చెవులు రిక్కించి వున్నారని పార్వతమ్మ 'ఆపరేషన్ డబల్ క్రాస్' చేసి మరీ చెప్పింది రహస్యంగా.

దాంతో శంకరం మాష్టారు విజృంభించాడు. బాలవ్యాకరణం సూత్రాలన్నీ గడగడ వల్లించాడు. తనకొచ్చిన పద్యాలన్నీ చకచకా చెప్పేసి, ఎక్కాల్లోపడి, ఇంగ్లీషుపైకి తేలి, హిందీ ఒడ్డుకు చేరాడు.

వానరుగారబ్బాయీ, పక్కవాటా పుల్లమ్మ కూతురూ బిక్కచచ్చి చూస్తున్నారు. చంటాళ్ళంతా ఏడుపు లంకించుకున్నారు.

ఇవేం పట్టించుకోకుండా అనర్గళంగా గంటన్నర ఉపన్యసించి ఉపశమించాడు శంకరం. "రేపుకూడా రండి. పిప్పరమెంట్లు పెడతాను" అన్నాడు.

అందరూ లేచి బయటి కురకబోయారు. "లైన్! లైన్!" బిగ్గరగా అరిచాడు శంకరం. పిల్లలంతా జడుసుకుని పారిపోయారు.

మర్నాడు స్కూలుకు వెళ్ళి క్లాసులో కూచున్నాడేగాని పాఠం చెప్పలేదు శంకరం. కలకు తగిన వల అల్లుతూ కూచున్నాడు. కంటికి ఆననవాళ్ళను దగ్గిర పిలిచి రహస్యంగా కుశల ప్రశ్నలు వేశాడు. ఈ ప్రశ్నలేవీ రాబోయే పరీక్షకి పనికిరావని గ్రహించారు వాళ్ళు. అయినా ఇంటిసంగతులూ, తమ ప్రైవేట్ సంగతులూ సగర్వంగా వివరించారు. ఆ వివరాలు వింటూంటే మాష్టారి ముఖం వెలవెల పోయింది. ప్రతివాడూ ఏదో ఒక మాష్టారి కబంధహస్తాల్లో చిక్కుకునే వున్నాడు. తను చాలా లేటు.

పరిశోధించగా పరిశోధించగా చివరికి క్లాసులో కొత్తగా చేరిన శిష్యపరమాణువొకడున్నట్లు తేలింది. అందర్నీ కంఠస్థపద్యం చదువు కోండని పురమాయించి, తలతిరిగినవాడి తలను గోటితో కత్తిరిస్తానని బెదిరించి పరమాణువును చేరబిలిచాడు.




బిక్కుబిక్కుమంటూ దగ్గరికొచ్చినవాడిని తలనుంచి దాదాపు పాదాలదాకా నిమిరాడు "బాబూ, నాన్నా, అమ్మా, చిట్టీ" అని నవ్వుతూ సంబోధిస్తూంటే వాడు కాస్సేపు భయపడ్డమాట వాస్తవం. కాని నాన్నగారి ఉద్యోగం, అడ్రసూ అడిగి తన తెలివితేటల్ని తెగ పొగిడేసూంటే "ఎంత మంచాడ్రా! అందరు మాష్టార్లిట్లా ఉండే ఎంతబావుణ్ణు!" అనుకున్నాడు అంతమందిలోనూ, తన్ను తప్పకుండా గౌరవించిన మాష్టారికి పొద్దున ఇంట్లో వొండిన చేపలపులుసు తెచ్చిపెడదా మనుకున్నాడు. కాని ఆయన పిలక చూసి

వూరుకున్నాడు.

"చిట్టీ! తెలుగు నీకు బాగా రాదుగదమ్మా?"

"కాదు మాష్టారూ! తెలుగులో నాదే ఫస్ట్ మార్కు మావూరి స్కూల్లో" కోశాడు.

"హతవిధీ" గుడ్లు తేలేశాడు శంకరం.

"మరి ఇంగ్లీషో?"

"ఎప్పుడూ తప్పలేదండి."

"ఫస్టుమార్కు రాలేదా?"

"వచ్చేదేగాని అక్కడి మాష్టారికి నామీద కోపమండి."

"అవునవును" ఉంటారు వెధవమాష్టర్లు. ఇక్కడైతే తప్పిస్తారు కూడా! చూడు నాన్నా...."

"నాన్న" వాత్సల్యంతో చూస్తున్నాడు "పుత్రుడు" శంకరాన్ని.

"మా యింటి దగ్గర్లోనేగా మీరుండేది! రోజూ రా. చదువుకుందువు గాని."

"మా యిల్లు దూరమే నండి!"

నూరినూరి శంకరం పళ్ళు లోపల పొడి అవుతున్నాయి.

"అయితే ఏం? రాత్రి మా యింట్లోనే పడుకోవచ్చు. పరుపూ అదీ వుంది. ఏం?" కుక్కి మంచం ఎలాగో బిగడీసినా పరుపు ఎక్కడైనా అరువు తేవాలి మరి! పరమాణువు కొండెక్కి కూచున్నాడు. అక్కణ్ణించి తల వూపే లోపల బెల్ కొట్టారు.

"సరే సాయంత్రం రా. మా యిల్లు తెలుసుగా!" అన్నాడు శంకరం లేస్తూ.

"తెలుసండి. పెద్ద మురికిగుంట ఎదురుదే గదండీ!"

నరాలు కుంగుతున్నాయి మాష్టారుకి. "గుంటా!? ఏమీలేదే!" గుంటడా!

"అదే నండీ! పైన కొన్ని పెంకులు కూడా లేవు. మా వంటింట్లో సహ మంటుంది" వాడి మాడు పెంకు ఊడ గొడదామనుకుని ఎలాగో తమాయించుకున్నాడు శంకరం.

"అదేలే! తప్పక రా బాబూ!" అని క్లాసులోంచి బయటపడ్డాడు. "నాలుగు పెంకులెచ్చి కప్పాలి; గుంట పూడ్చాలి" అనుకుంటూ.

పరమాణువు చుట్టూ మూగారు పిల్లలంతా. వాడు మాష్టారు తన కొక్కడికే చెప్పిన పాఠాన్ని అందరికీ చెప్పాడు మురిసిపోతూ. వాళ్ళంతా "ఇది ప్రైవేట్ పొడి" అని తేల్చి తమ అనుభవాలతో పోల్చుకున్నారు.

విజయ గర్వంతో ఊగిసలాడుతూ, తోటి టీచర్ల వైపు నిర్లక్ష్యంగా, గర్వంగా చూస్తూ, దార్లో బిడ్డి గుల్ని చూసి పెదవి విరుస్తూ, శంకరం సాయంత్రం యిల్లు చేరేసరికి, వాకిట్లో ఆడాళ్ళంతా మూగి పార్వతమ్మ ప్రైవేట్ వింటూ వున్నారు. అతన్ని చూసి వాళ్ళు తప్పుకున్నారు. లోపల పిల్లలు వంటింట్లో కూడా కూచుని వున్నారు. అతన్ని చూడగానే అందరూ నోరు చప్పరించటం మొదలెట్టారు. పగటి కల యింత త్వరగా సఫలం అవుతుందనుకోలేదు శంకరం.


లోపలి కొచ్చి కూచున్నాడో లేదో వానరు గారి కూతురు లేచి, చెయ్యి చాచి "పిప్పరమెంటు" అంది. అంతే. సిగ్నల్ అందుకున్నారు అందరూ. "నా కూ, నా కు" అంటూ లేచి అరవ సాగారు. ఒకర్నొకరు తోసుకున్నారు, ఏడుపులు మొదలయ్యాయి.

పిప్పరమెంట్లు తెప్పించటం తప్పని సరి అయింది.

నాల్లో తరగతి ఇంగ్లీషు పుస్తకం తీసుకుని 'రేట్, కేట్' అంటూ అరవ సాగాడు. పిల్లల చప్పరింపుల్లో ఆయన గొడవెవరికీ పట్టలేదు.

ఈ లోగా శిష్య పరమాణువు వాకిట్లో ప్రత్యక్షమయ్యాడు.

బాలకృష్ణుణ్ణి ఆహ్వానించే అక్రూరుళ్ళా నిలబడ్డాడు శంకరం.




"రామ్మా రా....రేయ్! బాబొస్తున్నాడు. అడ్డులేవండి. రా చిట్టీ!...ఆగావేం నాన్నా?" ప్రైవేట్ పరవశంతో వాణికిపోతూ ఏమిటేమిటో స్తుతిస్తున్నాడు శంకరం.

ప్రత్యేక ప్రదేశంలో మూలవిరాట్టులాగా అధివసించాడు పరమాణువు.

ఈ సందు చూసుకుని ఒక్కొక్కరే మెల్లగా బయటికి జారుకున్నారు. వాళ్ళ సంగతి పట్టించుకోదలచలేదు శంకరం- వాళ్ళను కేవలం ఆకర్షణకోసం మాత్రమే ఉపయోగించ దలిచాడు.

పరమాణువుకూ్కడా నాలుగు పిప్పరమెంట్లిచ్చి ప్రైవేట్ ప్రారంభించాడు.

"చూడు బాబూ! నీకో మంచికథ చెబుతాను." కథలంటే పిల్లలు చెవికోసుకుంటారని అతని నమ్మకం.

"కాదు మాష్టారూ! ఇంటి లెక్కలు చెయ్యాలి."

గొంతున పచ్చివెలక్కాయ ఇరుక్కుంది. లెక్కలే!

"ముందు కథ విను. భలే కథలే!" అని పూరించాడు శంకరం.

విధిలేక వినసాగాడు పరమాణువు

భలేకథ చెప్పాలని ఏవేవోకల్పించుకుంటూ పోతున్నాడు మాష్టారు.

ఐదు నిమిషాలు గడిచింది. పరమాణువు దగ్గరి పిప్పరమెంట్లు అయిపోయాయి. నాలు దిక్కులు చూస్తున్నాడు, ముక్కుతున్నాడు; మూలుగుతున్నాడు, ఊకొట్టడం ఎప్పుడో మానుకున్నాడు.

శంకరానికి విసుగెత్తింది. తను చెప్పే దేమిటో తనకే అంతుపట్టటం లేదు. భలేకథను సశేషం చెయ్యకపోతే లాభంలేదని తేల్చుకున్నాడు.

ఇంతలో ఉన్నట్టుండి శిష్యపరమాణువు ఏడవటం మొదలెట్టాడు.

"ఏం బాబూ! వొంట్లో బాగాలేదా?"

"కాదు మాష్టారూ! లెక్కలు చెయ్యకపోతే మాష్టారు కొడతారు."

"అంతేనా! వెధవలెక్క! ఇలా ఇయ్యి." తీసుకొని తెగ్గొట్టసాగాడు.

కూడాడు, తీసివేశాడు, హెచ్చవేసి, భాగించాడు, సగం నోట్సు పూర్తయింది. లెక్క పూర్తికాలేదు. ఎప్పటికైనా లెక్కచెయ్యక పోతారా అని ఆశగా చూస్తున్నాడు పరమాణువు. ఆశ అడియాసలవుతున్నాయి.

ఎనిమిదయింది, ప్రాణం కుదటబడ్డింది మాష్టారికి.

"చూడు నాన్నా! ఈ లెక్క రేపు చేసుకొస్తాగాని నువ్వు ఇంటికి పోతావా?"

"ఓ" అంటూ లేచాడు పరమాణువు పరమానందంతో. ఎలాగోలా లెక్కలపీడ తప్పితే చాలు!

ఆరాత్రి ఓ బాల్యస్నేహితుడింటికి వెళ్ళి లెక్క చేయించుకొచ్చి మర్నాడు శిష్యపరమాణువుకు సగర్వంగా అందజేశాడు శంకరం. ఆ వ్యవహారం అంతటితో ముగిస్తే బాగుండిపోను!

లెక్కల మాష్టారు క్లాసులోకి రాగానే పరిగెత్తుకుంటూపోయి లెక్క చూపించాడు పరమాణువు.

"ఏంరోయ్! లెక్క చేశావేమిటి?" అంటూ లెక్క చూశాడు మాష్టారు. పిల్లలూ, మాష్టారూ తన్ను మెచ్చుకోవాలని మెడ నిక్క బొడిచి, నిటారుగా నించున్నాడు పరమాణువు.

"లెక్క తప్పు. మళ్ళీ చెయ్యి వెధవా! కూడికలు కూడా రావు"

గుండె పూర్తిగా ఆగలేదు కుర్రాడికి. రోషం రెకెత్తించింది.

"తెలుగు మాష్టారు చేశారు మాష్టారూ! తప్పెందుకవుతుంది?" అని నిలదీసి అడిగాడు.

"ఏమిటి?" ఆశ్చర్యంతో కొయ్యబారిపోయాడు మాష్టారు.

"అవునండీ. వాడు తెలుగు మాష్టారి దగ్గర ప్రైవేట్!" ఎవడో కూశాడు. లెక్కల మాష్టారికి నవ్వాగలేదు. తెగనవ్వాడు. క్లాసంతా నవ్వింది. లెక్కల మాష్టారికి యిహ అక్కడుండి బుద్ధి రాలేదు. స్టాఫ్ రూముకు పరుగెత్తాడు. నవ్వుతూనే ఏమిటన్నారు యుద్ధముంగా.

"తెలుగు పంతులు దగ్గర ప్రైవేట్!"

స్టాఫంతా చచ్చేట్లు నవ్వింది, నవ్వలేక చచ్చింది.

తెలుగు మాష్టారి దగ్గిర ప్రైవేట్ చదివే అర్భకుణ్ణి. అమాయకుణ్ణి బలిపశువుని, శిశువుని మళ్ళీ మళ్ళీ తనివితీర చూస్తున్నారు. వినోదం అవసరమనుకుంటే సరి, వాణ్ణి చూస్తున్నారు. లేకపోతే వాణ్ణి గురించి మాట్లాడుకుంటున్నారు నవ్వుకుంటున్నారు. దీంతో వాడు పిల్లల్లో మరీ అలుసైపోయాడు వాణ్ణి "ప్చ్! పాపం!" అని పిలుస్తున్నారు. ఇంగ్లీషు మాష్టారు వెంకట్రావు తెలుగు మాష్టార్ల ప్రైవేట్లను గురించి లెక్చరు దంచుతున్నాడు బహిరంగంగా. దాంతో పరమాణువుకు తారెత్తింది ఆ రోజు వాడు ప్రైవేటుకు పోలేదు.

ఆ రాత్రి శంకరానికి నిద్ర పట్టలేదు.

ప్రియ శిష్యుడెందుకు రాలేదు? పిప్పరమెంటులో రుచి లేదా? లేక భలే కథ సీరియల్లో చవలేదా?

మర్నాడు స్కూల్లో వాణ్ణి ఒంటరిగా పిలిచి అడిగాడు. వాడే కారణమూ చెప్పకుండా "నేను రాను మాష్టారూ" అన్నాడు.

శంకరం బతిమాలాడు. బామాలాడు, గడ్రెజేశాడు, పిలక ఝాడించాడు. కళ్ళనీళ్ళెట్టుకుని యాక్షన్ చేశాడు.

కాని ఫలితం శూన్యం.


వాడేమీ లెక్క చెయ్యకుండా వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం కళ్ళొత్తుకుంటూ బిల్డింగులవేపు చూడకుండా ఇల్లు చేరాడు శంకరం.

ఇంట్లో సైలెన్స్!

చిన్న పిప్పరమెంట్లు ఇవ్వలేదని ఈరోజు పిల్లలంతా స్ట్రయిక్ చేశారు.

"పోతే పోనీండి. ఎన్నాళ్ళీ చేతిచమురు




ధాగోతం!" అని భర్తను పోదాకుస్తూ తను బావురుమని బిగ్గరగా ఏడ్చేసింది పార్వతమ్మ.

తనకి సరిపడే జరీ చీర ఇక ఆమె జన్మలో నేయించుకోలేదు.

ఈ వాటాలో వాన తప్పితే మరేమీ కురవదు.

మర్నాడు శంకరం క్లాసులో పాఠం చెబుతుండగా పరమాణువు మరో పెద్దమనిషిని వెంటబెట్టుకొచ్చాడు.

"ఏవయ్యా పంతులూ! నువ్వేనా ప్రైవేటుకు రాలేదని మావాణ్ణి కొట్టింది!"

"రామరామ" అంటూ లేచి నిల్చున్నాడు శంకరం.

"ఓరి పాపాత్ముడా! చిన్న పిప్పరమెంట్లూ, చిన్న బిళ్లకథా మరిచిపోయావుట్రా!" అనుకున్నాడు పరమాణువును చూసి.

"ఉండండి. డి. ఇ. ఓ కి రిపోర్టిస్తాను" అని చకచకా వెళ్ళిపోయాడాయన.

శంకరం వెంటబడ్డాడు. రన్నింగ్ రేస్ మొదలైంది.

చివరికెలాగైతేనేం, ఆయన కాళ్ళట్టుకుని తన పిల్లల సంఖ్య చెప్పి కన్నీళ్ళు గుమ్మరించాడు.

"ఇలాంటి తప్పుడుపన్లు చెయ్యొద్ద"ని హితబోధ చేసి క్షమించినట్టు పోజెట్టి చక్కాపోయాడాయన.

ఈ సంగతి తెలిసి హెడ్ మాస్టారు శంకరాన్ని చెడామడా చీవాట్లెట్టి "అయినా నీకిదే బుద్ధి శంకరం? తెలుగు మాష్టారు ప్రైవేట్ చెప్పటమా?" అని ముగించాడు.

శంకరం తలకాయ వెనకాల జ్ఞానచక్రం వెలిగింది.

ఇంటికొచ్చి జాడీలో ఊరవేసిన కాయితాల్ని తీసి తగలేసి, స్నానంచేసి, భోంచేసి నిద్రపోయాడు.

ఇక ఈదేశం ఎలా పోయినా అతనికే ప్రమేయమూ లేదు.

✱